క్లుప్తంగా

క్రీస్తు విశ్వాసులకు క్రిస్మస్ శుభాకాంక్షలు



కంకిపాడు: వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రీస్తు విశ్వాసులకు శుభాకాంక్షలు తెలుపుతూ క్రిస్మస్ కానుకలను అందజేశారు. లోకరక్షకుడైన క్రీస్తు రాకను స్వాగతిస్తూ వేడుకలు జరుపుకొనే విశ్వాసులు ఏసు చూపిన ప్రేమ, శాంతి, సహనం మార్గాల్లో పయనించాలని సూచించారు. క్రిస్మస్ పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



పెనమలూరు: కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రతిభావంతులైన విద్యార్థులకు నార్త్ సౌత్ ఫౌండేషన్ ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కాలేజీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో నార్త్ సౌత్ ఫౌండేషన్ ప్రతినిధి సూరపనేని వెంకటరత్నం 124 మంది విద్యార్థులకు రూ. 31 లక్షల విలువ చేసే చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరత్నం మాట్లాడుతూ అమెరికాకు చెందిన డాక్టర్ చిట్టూరి రత్నం స్థాపించిన ఎన్ఎస్ఎఫ్ ఫౌండేషన్ ద్వారా ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పి.వెంకట సతీష్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, డాక్టర్ అచ్యుతబాబు, డాక్టర్ కె. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన హర్షిత

దావాజీగూడెం (గన్నవరం): జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు మండలంలోని దావాజీగూడెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని మద్దూరి హర్షిత ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సునీత తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో విద్యార్థినికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. ఇటీవల విజయవాడలో నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అండర్-17 (84 ప్లస్) విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి హర్షిత రాష్ట్ర స్థాయి లో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. విద్యార్థిని ప్రతిభను గుర్తించిన సెలక్టర్లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం హర్షితను, వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్ చంద్రశేఖర్(చందు), విజయకుమారిని హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కంకిపాడు: వ్యక్తి అదృశ్యంపై కంకిపాడు పోలీసుస్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. మండలంలోని ఈడుపుగల్లు గ్రామానికి చెందిన మోరం రామాంజనేయులు తాపీ కార్మికుడు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం తెల్లవారుజామున ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో రామాంజనేయులు కుమారుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సంజా ఉత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించే క్రమంలో ఈ నెల 26 నుంచి జనవరి 30వ తేదీ వరకు జరుగుతున్న సంజా ఉత్సవ్‌లో నగర వాసులందరూ పాల్గొనాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర కోరారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో సంజా ఉత్సవ్ మేళా పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సంజా ఉత్సవ్ మేళాలో స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను పటమటలోని మేరీస్ స్టెల్లా కాలేజ్ ఇండోర్ స్టేడియంలో విక్రయిస్తారన్నారు. మేళాలో 100కు పైగా చేనేత, స్వదేశీ ఉత్పత్తుల స్టాల్ ఉంటాయని, కేవలం ప్రదర్శన, అమ్మకాలు కాకుండా సాంస్కృతిక కార్యక్రమాలు, కిడ్స్ ప్లే, ఫుడ్ కోర్ట్ ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు మేళా జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వీఎంసీ యూసీడీ పీవో వెంకట నారాయణ, టెక్నికల్ ఎక్స్‌పర్ట్ ఫణి కుమార్, సుజాత, రవిశంకర్, సీఓ శ్రీనివాస్, ఎంఐఎస్ లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

మినుము రైతుల్లో గుబులు

- వాతావరణంలో మార్పులు
- పంట దెబ్బతినే అవకాశం
- దాళ్వావరి రైతులకు వాన మేలు

కంకిపాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ముసురు పట్టేసింది. సోమవారం రాత్రి నుంచి వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై మబ్బులు కమ్మింది. సాధారణం కంటే అధికంగా తీవ్రమైన చలిగాలులు వీస్తున్నాయి. ముసురు ప్రభావంతో చిరు జల్లులు, మోస్తరు వర్షం పడుతోంది. ముసురు తీవ్రత పెరిగే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. అయితే దాళ్వా వరి సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్న రైతులకు మాత్రం ఈ వర్షం ఉపయుక్తంగా ఉంటుందని చెబుతున్నారు.

తీత దశలో ఉన్న పంట

పెనమలూరు నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో సుమారు 300 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో మినుము సాగు జరిగింది. ప్రధానంగా మెట్ట భూముల్లో రైతులు మినుము సాగు చేశారు. ప్రస్తుతం మినుము పంట తీత దశలో ఉంది. ముందస్తుగా విత్తనాలు చల్లిన రైతులు మినుము పంట తీత పనులను చేపట్టారు. అయితే వరుసగా తుపాను, అల్పపీడన ప్రభావంతో మారుతున్న వాతావరణ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. తీత దశలో ఉన్న మినుము పంటకు తీవ్రమైన చలిగాలులు, వర్షం నష్టం కలిగిస్తుందని రైతులు చెబుతున్నారు. మినుము కాయలు పగిలిపోయి, పంట కల్లంలోనే వృధాగా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెప్టెంబరులో వచ్చిన భారీ వర్షాలతో నష్టపోయిన రైతులు ప్రత్యామ్నాయంగా మినుము పంటను సాగు చేశారు. పంటచేతికి వచ్చే సమయంలో వర్షం రూపంలో నష్టాన్ని మిగుల్చుతుందని ఆవేదన చెందుతున్నారు. రబీ సీజన్‌లో మినుము విత్తనం చల్లిన పొలాలు మొలక, మూరు ఆకు దశలో ఉన్నాయి. ఈ దశలో వర్షం కారణంగా విత్తనాలు కుళ్లిపోయి, మొక్క చనిపోయే పరిస్థితి ఉందని రైతులు భావిస్తున్నారు. వర్షం పెరిగితే పసుపు తోటల్లో నీరు నిలిచి ఇప్పటికే వ్యాప్తి చెందుతున్న దుంప కుళ్లు తెగులు మరింత ఉధృతం అయ్యే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గొడవర్రులో తీతకు సిద్ధంగా ఉన్న మినుము పంట



ఈడుపుగల్లులో గాలిగూళ్లు మీద ఉన్న మినుము పంట

వరి నారుమడులకు జీవం

దాళ్వా సీజన్‌లో వరి సాగుకు వర్షం జీవం పోసినట్టే. ఇప్పటికే బోర్ల సదుపాయం ఉన్న భూముల్లో రైతాంగం వరి నారుమడులు పోసుకున్నారు. 10 నుంచి 15 రోజులు వయస్సు గల నారుమడి మళ్లలో ఉంది. నారుమడి ఎదుగుదలకు వర్షం ఉపకరిస్తుందని చెబుతున్నారు. వాతావరణం తేమగా ఉండటం, అడపా దడపా కురుస్తున్న వర్షాలకు పొలాల దమ్ము పనులు చేసి వరినాట్లకు భూములను సన్నద్ధం చేసుకుంటున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో నారుమడి సంరక్షణ చర్యల్లో రైతులు నిమగ్నమయ్యారు.



దావులూరులో నాట్లకు సిద్ధమవుతున్న వరి నారుమడి

అభయాంజనేయునికి ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామివారి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నసంతర్పణ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయునికి తమలపాకులతో విశేషంగా పూజలు జరిగాయి. బాపులపాడుకు చెందిన కాకాని సత్యవాణి ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

చిన్నారులకు ఆటల పోటీలు

గన్నవరం: స్థానిక ఎస్సీ కాలనీలో కృష్ణ చిల్డ్రన్స్ క్లబ్, కుల వివక్ష పోరాట సమితి సంయుక్త ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా మంగళవారం చిన్నారులకు ఆటల పోటీలను నిర్వహించారు. రన్నింగ్, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్స్ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిల్డ్రన్స్ క్లబ్ ఆర్గనైజర్ కీర్తి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. ఆ దిశగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు క్రీడా పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. క్రీడలతో చిన్నారులు మానసికంగా , శారీరకంగా ఎంతో ఉత్సాహంగా ఉంటారని వివరించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు క్రిస్మస్ పండుగ రోజున బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆటల పోటీల కార్యక్రమంలో కేవీపీఎస్ నేతలు మల్లంపల్లి ఆంజనేయులు, మిరప నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాల పరిష్కారానికి చర్యలు



పునాదిపాడు రెవెన్యూ సదస్సులో కుల ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న తహసీల్దార్ భావనారాయణ



గోసాల రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ గోపాలకృష్ణకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

కంకిపాడు: భూ వివాదాలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ వి.భావనారాయణ పేర్కొన్నారు. మండలంలోని పునాదిపాడు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఎఫ్‌లైన్, పట్టా దారు పాసుపుస్తకం, మ్యూటేషన్ కోసం రైతులు అర్జీలు అందించారు. పలువురు అర్జీదారులకు కుల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. తహసీల్దార్ భావనారాయణ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మునిబోయిన వెంకటేశ్వరరావు, వీఆర్ఓలు మల్లికార్జునరావు, నాగిరెడ్డి, స్థానిక నేతలు కె.సుధీర్, నాగరాజు పాల్గొన్నారు.



బీబీగూడెం రెవెన్యూ సదస్సులో తహసీల్దార్‌కు అర్జీ అందజేస్తున్న రైతు

బీబీగూడెంలో..

గన్నవరం రూరల్: మండలంలోని బీబీగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. పలువురు రైతులు భూసమస్యలపై తహసీల్దారు కేవీ శివయ్యకు అర్జీలను అందజేశారు. తహసీల్దారు శివయ్య మాట్లాడుతూ ప్రతి అర్జీని పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. మాజీ సర్పంచ్‌లు బోయపాటి బసవపూర్ణయ్య, మురళీకృష్ణ, వీఆర్వో శివ నాగ రాజకుమారి, గుజ్జర్లపూడి వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

పెనమలూరు: గోసాల వైకుంఠపురం వద్ద ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించారని, వెంటనే ఆక్రమణలు తొలగించాలని కోరుతూ గ్రామస్తులు తహసీల్దార్ గోపాలకృష్ణకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు చేసినా ఇరిగేషన్ ఏఈ స్పందించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్పంచి సంగెపు శ్రీనివాసరావు, పోలవరపు రవి, ఎండీ ఆషీఫ్ పాషా, ఎండీ హాజీఆలి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెండో పంట సాగుపై రైతులు దృష్టి పెట్టాలి

పెనమలూరు: రైతులు రెండో పంటపై దృష్టి పెట్టి దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారిణి కనకమేడల శైలజ అన్నారు. వణుకూరు, గోసాల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ దాళ్వా సాగు చేసే రైతులు నారు మళ్లు సిద్ధిం ఇవ్వగానే పనులు ప్రారంభించాలన్నారు. వాతావరణం కూడా అనుకూలంగా ఉందని తెలిపారు. మొక్కజొన్న రైతులు పురుగు ఆశించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎరువులు, పురుగు మందులు ఎలా వాడాలో రైతులకు వివరించారు. ధాన్యం మిల్లులకు తరలించాల్సిన రైతులు ఆలస్యం చేయకుండా వెంటనే తరలించాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ చాముండేశ్వరి, కిరణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ శైలజ, రైతులు

క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబు



గన్నవరం ఆర్సీఎం చర్చి ఎదురుగా ఏర్పాటు చేసిన భారీ క్రిస్మస్ స్టార్



విద్యుత్ దీపాల వెలుగులో గన్నవరం సీఎస్ఐ టౌన్ చర్చి

గన్నవరం: క్రిస్మస్ పర్వదిన వేడుకలకు గన్నవరం ప్రాంతంలోని చర్చిలు ముస్తాబయ్యాయి. స్థానిక ఆర్సీఎం బాలయేసు చర్చిని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పాటు చర్చి ఎదురుగా ఏర్పాటు చేసిన భారీ క్రిస్మస్ స్టార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా ఉన్న సీఎస్ఐ టౌన్ చర్చిని విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. దావాజీగూడెం, అల్లాపురం, కేసరపల్లి, అజ్జంపూడి, బుద్దవరం గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలకు చర్చిలను సిద్ధం చేశారు.

ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్‌ను పురస్కరించుకుని చర్చిలను విద్యుత్‌దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. చర్చి వద్ద క్రిస్మస్ స్టార్స్‌ను ఏర్పాటు చేశారు. పెద్ద అవుటపల్లిలోని బ్రదర్ జోసఫ్ తంబి చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. చర్చి వద్ద ఏసుక్రీస్తు జననాన్ని తెలుపుతూ పశువుల పాకను ఏర్పాటు చేశారు.



పెద్ద అవుటపల్లిలో చర్చి వద్ద ఏర్పాటు చేసిన పశువుల పాక

సెమీ క్రిస్మస్ వేడుకలు

కంకిపాడు: ఈడుపుగల్లులోని నలంద విద్యానికేతన్ వసంత క్యాంపస్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కంకిపాడు విచారణ గురువు ఫాదర్ ఎం.సాల్మన్‌రాజు సెమీ క్రిస్మస్ వేడుకలకు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. క్రీస్తు సందేశాన్ని చిన్నారులకు వినిపించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆలపించిన భక్తిగీతాలు, ప్రదర్శించిన క్రీస్తు జీవిత వృత్తాంతం నాటకం అలరించింది. క్రీస్తు జన్మించిన పశువుల కొట్టం ముందు విద్యార్థులు, ఉపాధ్యాయులు కొవ్వొత్తులు వెలిగించి బాలయేసును ఆరాధించారు. వేడుకలను నలంద విద్యాసంస్థల సీఏసీ సుధారాణి, పాఠశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి పర్యవేక్షించారు.

బండారుగూడెంలో..

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం బండారుగూడెంలోని సీఎస్ఐ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా జరిగాయి. చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పశువుల పాక, ఏసుక్రీస్తు జననం, గొర్రెల కాపరులు, దేవదూతల ప్రతిమలు ఆకట్టుకున్నాయి. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పాస్టర్ జాన్ మహేష్ క్రిస్మస్ సందేశాన్ని ఉపదేశించారు. గ్రామ ప్రముఖులు కలతోటి పెద్ద చెన్నయ్య, పరిమి రాకేష్, పరిమి సుబ్బయ్య, అబ్బూరి జీవరత్నం, బర్రె లెనిన్ పాల్గొన్నారు.



ప్రత్యేక వేషధారణలో నలంద విద్యానికేతన్ చిన్నారులు



బండారుగూడెంలో సెమీ క్రిస్మస్‌లో ప్రార్థనలు

హెల్మెట్‌తో ప్రాణానికి భద్రత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దని, హెల్మెట్‌తో ప్రాణానికి సైతం రక్షణ ఉంటుందని వెస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ జి.రామకృష్ణ అన్నారు. వన్‌టౌన్‌లోని కెనాల్‌రోడ్డు, ప్రకాశం బ్యారేజీ, మోడల్ గెస్ట్‌హౌస్ తదితర ప్రాంతాల్లో మంగళవారం హెల్మెట్ లేకుండా వాహనాలను నడుపుతున్న వాహన చోదకులను ఆపి, వారికి జరిమానాలను విధించారు. వాహనదారులకు కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఏడీసీపీ రామకృష్ణ మాట్లాడుతూ.. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాన్ని నడపవద్దన్నారు. అలాగే వాహనాలు నడిపే క్రమంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యానికి ప్రాణాలను బలి పెట్టవద్దన్నారు. కార్యక్రమంలో వెస్ట్ ఏసీపీ దుర్గారావు, సీఐ గురుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): విజయవాడలో ఈనెల 28, 29తేదీల్లో ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా మహాసభలు జరగనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

జై భవానీ.. జైజై భవానీ





కుమారుడితో అమ్మ సన్నిధిలో..

అమ్మవారి ఆలయంలో భవాని



ఇరుముడులు సమర్పిస్తున్న భవానీలు

భవానీ దీక్షల విరమణ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా భవానీలు ఇంద్రకీలాద్రికి తరలి రావడంతో నగరంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పద్మావతి ఘాట్, సీతమ్మ వారి పాదాలు, భవానీ, పున్నమి ఘాట్లలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. భవానీలు గిరి ప్రదక్షిణ చేసి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఇరుముడులు సమర్పిస్తున్నారు. జై భవానీ.. జైజై భవానీ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

